సాక్షి మెదక్

శనివారం । 22 । జూలై । 2023



గూడు చెదిరే..

ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు సామాన్యుడి గూడు చెదిరింది. అపురూపంగా నిర్మించుకున్న పూరిళ్లు, పెంకుటిళ్లు వాన దెబ్బకు నెలకొరిగాయి. 8లో



నిబంధనలకు నీళ్లు

మున్సిపాలిటీలో యూజీడీ (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) పనులు ఇష్టారీతిన చేపట్టడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు లోపాలు బయటపడుతున్నాయి. 8లో



ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ముసురుతో కూడిన వర్షాలు కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ పట్టణ ప్రజలకు సూచించారు. 9లో

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన అదనపు కలెక్టర్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్ కలెక్టరేట్: జిల్లా అదనపు కలెక్టర్‌గా నియమితులైన జి.వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. వివిధ శాఖల అధికారులు అదనపు కలెక్టర్‌కు స్వాగతం పలికారు. అనంతరం టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్, జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్, ఉపాధ్యక్షుడు ఎండీ.ఇక్బాల్ పాషా, ఎండీ.ఫజులుద్దీన్, పంచాయతీ సెక్రెటరీల ఫోరం జిల్లా అధ్యక్షుడు నగేష్ తదితరులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కొనసాగుతున్న దీక్షలు



దీక్షలో అఖిలపక్ష నాయకులు

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ సాధన ధ్యేయంగా రామాయంపేటలో చేపట్టిన దీక్షలు శుక్రవారం నాటికి 117వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం డివిజన్ ప్రకటించే వరకు ఆందోళన చేస్తామని ఈ సందర్భంగా అఖిలపక్ష ప్రతినిధులు పేర్కొన్నారు. దీక్షలకు వ్యాపార, యువజన, కుల సంఘాలు మద్దతు ప్రకటించాయి.

సినారె పురస్కారానికి ఎంపిక



సూర్య ప్రకాష్‌రావు

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ మండలం కాగజ్ మద్దూర్ జెడ్పీ హెచ్ఎస్ సైన్స్ ఉపాధ్యాయుడు రచయిత, కవి, డాక్టర్ రాయరావు సూర్య ప్రకాష్ రావుకు సినారె పురస్కారం అందుకోనున్నారు. 2023 సంవత్సరానికి గాను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు సూర్య ప్రకాష్‌రావు శుక్రవారం తెలిపారు. ఈ నెల 30న మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారం అందుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

గౌడ కులస్తులకూ ఇవ్వాలి



మాట్లాడుతున్న నర్సాగౌడ్

తూప్రాన్: ప్రభుత్వం బీసీలకు అందిస్తున్న రూ.లక్ష సాయాన్ని గౌడ కులస్తులకూ వర్తింపజేయాలని మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్ కోరారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ జిల్లా 11వ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీల్లో భాగమైన గౌడ కులస్తుల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక రుణాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో గౌడ కులస్తులు పాల్గొన్నారు.

బాధ్యులను శిక్షించాలి

మెదక్‌జోన్: మణిపూర్‌లో కుకీ మహిళలకు జరిగిన అన్యాయానికి బాధ్యత వహించి ఆ రాష్ట్ర సీఎం రాజీనామా చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి దయాసాగర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బీజేపీ డబుల్ ఇంజన్ పాలనకు ఈ ఘటన నిదర్శనమని ఎద్దేవా చేశారు. రెండు నెలలు దాటినా ఘటనపై అక్కడి ప్రభుత్వం, పోలీసులు చర్యలు తీసుకోకపోవటంపై మండిపడ్డారు. బాధ్యులపై చర్యలు తీసుకోకుంటే దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామన్నారు.

నీటి సరఫరాలో అంతరాయం

మెదక్ మున్సిపాలిటీ: నేడు మెదక్ పట్టణంలో భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ జానకీరాం సాగర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సింగూర్ డ్యామ్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కారణంగా నీటి సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు.



వెల్దుర్తి(తూప్రాన్): పొంగిపొర్లుతున్న హల్దీ



ఘణపురం ప్రాజెక్టు



చిలప్‌చెడ్(నర్సాపూర్): చిట్యాల్‌లో వరి పొలాల్లో చేరిన వరదనీరు

వాగుల పరవళ్లు.. ప్రాజెక్టుల్లో జలసిరులు

- పోచారం, ఘణపురం, మంజీరా, హల్దీలకు భారీగా వరద
- అత్యధికం 118.2 మి.మీ
- అత్యల్పంగా 52.8 మి.మీ వర్షపాతం నమోదు

మెదక్‌జోన్/వెల్దుర్తి(తూప్రాన్): నాలుగు రోజులుగా జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో ప్రాజెక్టులు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. మెదక్-కామారెడ్డి సరిహద్దులో పోచారం ప్రాజెక్టు పరవళ్లు తొక్కుతోంది. పట్టణ శివారులోని పుష్పలవాగు, హల్దీ, మంజీరాలకు భారీగా వరద వస్తోంది. వందల ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. ఇప్పటికే 450 చెరువులు నిండగా, 34 చెక్ డ్యాంలు మత్తడి దూకుతున్నాయి. ఘణపురం ప్రాజెక్ట్ నుంచి 17వేల క్యూసెక్కుల నీరు దిగువకు వెళుతున్నట్లు అధికారులు తెలిపారు.

రోడ్ల పైనుంచి వరద

శివ్వంపేట మండలం నవాబుపేట-గోమారం రోడ్డుపై లోలెవల్ వంతెన నీట మునిగి రాకపోకలు స్తంభించాయి. హవేలీఘనపూర్ మండలం దూప్ సింగ్ తండాలో వాగుపై, మెదక్ మండలం పాతూర్ పరిధిలో కొచ్చెరువు తండా రోడ్డుపై నుంచి వరదనీరు ప్రవహిస్తుండడంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. చిలప్‌చెడ్ మండలంలో అత్యధికంగా 118.2 మిల్లీ మీటర్లు, నిజాంపేటలో అత్యల్పంగా 52.8 మిల్లీ మీటర్ల వర్షపాతం కురిసింది. పోచారం అందాలను చూసేందుకు మెదక్, కామారెడ్డి, హైదరాబాద్, నిజామాబాద్ జిల్లాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు.



పోచారం ప్రాజెక్టు నుంచి కిందకు వెళుతున్న వరదనీరు

అత్యవసర సేవలకు పోలీసులు సిద్ధం

ఎస్పీ రోహిణి ప్రియదర్శిని



దూప్‌సింగ్ తండా బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

హవేళీఘనపూర్: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర సేవలు అందించేందుకు పోలీసులు సిద్ధంగా ఉన్నారని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అన్నారు. వర్షాలకు కొట్టుకుపోయిన మండలంలోని వాడి పంచాయతీ దూప్‌సింగ్ తండాకు వెళ్లే బ్రిడ్జిని శుక్రవారం పరిశీలించారు. అనంతరం హవేళీఘనపూర్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ప్రజలకు సేవలందించేందుకు పోలీసు శాఖ 24గంటలు అందుబాటులో ఉంటుందని తెలిపారు. విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని, రైతులు పొలాల వద్దకు వెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏవైనా విపత్కర పరిస్థితులుంటే 08452-223533, లేదా 100కు డయల్ చేసి సమాచారం అందించాలన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ సైదులు, ఎస్ఐ శేఖర్ ఉన్నారు.

ఓటుపై చైతన్యం

- దృష్టి సారించిన జిల్లా యంత్రాంగం
- మూడు చోట్ల డెమో సెంటర్లు
- రెండు వాహనాలతో మొబైల్ ప్రచారం
- ఈవీఎం, వీవీ ప్యాట్‌లపై అవగాహన

ఏడాది చివరలో జరగనున్న శాసనసభ ఎన్నికలకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. పొరపాట్లు లేకుండా ఓటరు జాబితా తయారీతో పాటు, నూతన ఓటర్లకు అవగాహన కల్పించడం లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామాల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వీవీ ప్యాట్‌లను ఏర్పాటు చేసి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.



నర్సాపూర్‌లోని ఓ కళాశాలలో విద్యార్థులకు ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ రాజర్షిషా (ఫైల్)

మెదక్‌జోన్: జిల్లాలో ఓటు నమోదు శాతం పెంచేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఓటింగ్ యంత్రాలపై సందేహాలను తొలగించేందుకు మూడు చోట్ల డెమో సెంటర్లను కేటాయించారు. మెదక్ నియోజకవర్గంలో 274, నర్సాపూర్ నియోజకవర్గంలో 302 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1,400 మంది ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఓటర్లు ఎక్కువగా ఉంటే మరో పోలింగ్ బూత్‌కు కేటాయిస్తారు. ఇప్పటికే కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రత్యేకంగా నిర్మించిన గోదాముల్లో ఎలక్ట్రానిక్ యంత్రాలను భద్రపరచి, పలుమార్లు తనిఖీ సైతం నిర్వహించారు.

విస్తృతంగా ప్రచారం

మెదక్ కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయం, నర్సాపూర్‌లో ఈవీఎం, వీవీ ప్యాట్ యంత్రాలను ఏర్పాటు చేశారు. వీటితో పాటు మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలకు ఒకటి చొప్పున రెండు మొబైల్ వాహనాలు పోలింగ్ బూత్ పరిధిలో తిప్పుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఆర్డీఓ కార్యాలయానికి వచ్చే వారికి ఓటు హక్కు ప్రాధాన్యతపై వివరిస్తున్నారు. విద్యాసంస్థల్లో విద్యార్థులకు ఓటు ప్రాముఖ్యతపై వివరిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగుల కోసం ర్యాంప్, విద్యుత్, మరుగుదొడ్డి, తాగునీటి సౌకర్యం ఉండేలా చర్యలు అన్ని తీసుకుంటున్నారు.



గ్రామాల్లో ప్రచారం కల్పిస్తున్న మొబైల్‌వ్యాన్ ఇదే

ఆర్ఓల నియామకం

కేంద్ర ఎన్నికల సంఘం నియోజకవర్గాల వారీగా రిటర్నింగ్ అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలకు ఆర్డీఓ, రిటర్నింగ్ అధికారులు(ఆర్ఓ)లతో పాటు ఎలక్టరోల్ రిజిస్ట్రేషన్ అధికారులను సైతం నియమించారు. మెదక్, నర్సాపూర్‌కు ఏడుగురు చొప్పున తహసీల్దార్లను సహాయక రిటర్నింగ్ అధికారులుగా కేటాయించారు. బూత్ లెవల్ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటా తిరిగి అర్హులను ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రోత్సహిస్తున్నారు. ఇంట్లో ఓటర్ల సంఖ్య, చనిపోయిన వారి వివరాలు, మార్పులు చేర్పులు చేసేలా బీఎల్‌ఓలకు శిక్షణ అందించారు.

పాత ఇళ్లల్లో ఉండొద్దు: ఎమ్మెల్యే

మెదక్ మున్సిపాలిటీ: భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు పాత ఇళ్లో ఉండొద్దని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం నూతనంగా నిర్మిస్తున్న కలెక్టరేట్ భవనం పనులను ఆమె పరిశీలించారు. అనంతరం పట్టణంలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వర్షాలకు ఇళ్లు కూలిపోయిన బాధితులకు ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. వరద ధాటికి చెరువు కట్టలు తెగే అవకాశం ఉన్నందున ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ అంజాగౌడ్, హవేళిఘనపూర్ మండల అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు రాగి అశోక్, శ్రీధర్ యాదవ్, సాయిరాం, పడాల సతీష్, గంజి నవీన్ తదితరులు ఉన్నారు.



కలెక్టరేట్ భవనం పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

రిజిస్టర్ నిర్వహణ తప్పనిసరి

నర్సాపూర్ రూరల్/కొల్చారం(నర్సాపూర్): రేషన్ డీలర్లు స్టాక్ వివరాలను రిజిస్టర్‌లో తప్పకుండా నమోదు చేయాలని కేంద్ర విజిలెన్స్ కమిటీ సభ్యులు డాక్టర్ ఉపేందర్, జీ.ఎల్ శర్మ అన్నారు. శుక్రవారం నర్సాపూర్ మండలం పెదచింతకుంట, కొల్చారం మండలంలో రాంపూర్ రేషన్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డీలర్లు సమయపాలన పాటించాలని, నాణ్యమైన బియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం పేదలకు ఇస్తున్న బియ్యాన్ని పక్కదారి పట్టించినట్లు తెలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పిల్లి ఆనంద్ కుమార్, మండల అధ్యక్షుడు నర్సింలు, డీలర్లు జైపాల్ గోవర్ధన్ రెడ్డి, రవి గౌడ్, సుధాకర్, దశరథ, మెదక్ జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ గుప్తా తదితరులు ఉన్నారు.



నర్సాపూర్ రూరల్: రేషన్ దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

సదుపాయాల కల్పనలో విఫలం

మెదక్‌జోన్: మౌలిక సదుపాయాల కల్పనలో పాలకులు విఫలమయ్యారని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి మ్యాడం బాలకృష్ణ ఆరోపించారు. శుక్రవారం కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి కలెక్టరేట్, డబుల్ బెడ్‌రూం ఇళ్ల కాలనీని సందర్శించారు. డబుల్‌బెడ్రూం కాలనీల వద్ద మోకాళ్ల లోతు నీరు నిలువడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆయనకు వివరించారు. అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద వెంటనే సీసీ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ నిర్మాణం నాసిరకంగా ఉందని, లోతట్టు ప్రాంతాల్లో నిర్మించడంతో వర్షాకాలంలో చుట్టూ నీరుచేరే అవకాశం ఉందన్నారు. ఆయనతో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొహమ్మద్ హాఫీజ్ మొల్సాబ్, కౌన్సిలర్ రాజలింగం, మాజీ కౌన్సిలర్ విక్రమ్, సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ షేక్ సల్మాన్, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు సంజీవ్, నాగిరెడ్డి, పట్టణ సోషల్ మీడియా కోఆర్డినేటర్ నవీన్ చౌదరి, జకారియా, బిక్షపతి, ప్రభాకర్ ఉన్నారు.



నిరసన తెలుపుతున్న బాలకృష్ణ, తదితరులు

నిర్లక్ష్యానికి నిలువుటద్దం



కలెక్టరేట్‌లోని డీసీఓ కార్యాలయంలో ఫైళ్లు

జిల్లా సహకార శాఖ అధికారి కార్యాలయం అధికారుల నిర్లక్ష్యానికి ప్రతీకగా నిలుస్తోంది. వర్షా లకు కలెక్టరేట్‌లోని డీసీఓ కార్యాలయంలో ఫైళ్లు తడిసిపోయాయి. టేబుళ్లపై ఉంచిన ఫైళ్లు కిటికీల నుంచి పడిన వర్షపు జల్లులకు తడిసిపోయాయి. అధికారులు, సిబ్బంది వాటిని పట్టించుకోకుండా అక్కడే పడేయం గమనార్హం.

–మెదక్ కలెక్టరేట్

ముందస్తు చర్యలతో వ్యాధులకు చెక్

కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: ముందస్తు చర్యలతో వ్యాధులు రాకుండా చేయొచ్చని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, చంటి క్రాంతికిరణ్, జిల్లా అధికారులతో కలిసి సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వర్షాలు కురుస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని, మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్ గన్యా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారులకు సూచించారు. మెదక్ నియోజకవర్గంలో 3, దుబ్బాక నియోజకవర్గంలో 2, ఆందోల్ నియోజకవర్గంలో ఒకటి, నర్సాపూర్ నియోజకవర్గంలో ఒకటి చొప్పున మొత్తం 7 డెంగీ కేసులు నమోదైనట్లు తెలిపారు. దోమల నివారణకు చర్యలు చేపట్టాలని, ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, కూలర్లు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, వాడి పడేసిన వస్తువులు, ప్లాస్టిక్ డబ్బాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకునేలా ఇంటింటా వివరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ చందునాయక్, జిల్లా స్టాటిస్టికల్ అధికారి డాక్టర్ నవీన్, సహాయ మలేరియా నివారణ అధికారులు కుమారస్వామి, విజయేందర్, కమ్యూనిటీ హెల్త్ అధికారి రహీం పాషా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉండాలి

మరో మూడు రోజులు వర్షాలు ఉన్నందున అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. శుక్రవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లతో మాట్లాడారు. పాత ఇళ్లల్లో ఉన్నవారిని గుర్తించి తాత్కాలిక శిబిరాలకు తరలించాలని ఆదేశించారు. అత్యవసర సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. అవసరమైన వారు కంట్రోల్ రూం 9391942254 నంబర్‌కు ఫోన్ చేసి సాయం పొందాలన్నారు. కరెంటు సమస్యల పరిష్కారం కోసం 79016 77782 నంబర్‌లో సంప్రదించాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా, పక్కన ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, చంటి క్రాంతి కిరణ్

అట్రాసిటీ కేసులు త్వరగా పరిష్కరించాలి

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కలెక్టర్ రాజర్షిషా పోలీసు అధికారులకు సూచించారు. శుక్రవారం ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, చంటి క్రాంతి కిరణ్, ఎస్పీ రోహిణి ప్రియదర్శినితో కలిసి కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 2వ త్రైమాసికంలో 16 అట్రాసిటీ కేసులకు గాను 8 ట్రయల్స్‌లో ఉన్నాయని, ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న మరో 8 కేసులను కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎఫ్ఐఆర్, చార్జ్‌షీట్ నమోదు చేసి ఆర్థికసాయం కోసం కలెక్టరేట్‌కు పంపించాలన్నారు. అట్రాసిటీ బాధితులకు ఆర్థికసాయం కోసం గతేడాది రూ.58లక్షలు ఖర్చు చేశామని, ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో రూ.35లక్షలు ఖర్చు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ సరైన ఆధారాలతో విచారణ జరిపి బాధితులకు న్యాయం దక్కేలా చూడాలన్నారు. ఆందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ మాట్లాడుతూ చార్జ్‌షీట్ పూర్తయిన కేసులను ఎప్పటికప్పుడు కోర్టుకు సమర్పించాలన్నారు. అట్రాసిటీ కేసులపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్టార్టర్ బోర్డులో షార్ట్ సర్క్యూట్


షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు

నర్సాపూర్ రూరల్: షార్ట్ సర్క్యూట్‌తో మండలంలోని అవంచ ఎస్సీ కాలనీలో శుక్రవారం ఉదయం మంటలు చెలరేగాయి. ఎస్సీ కాలనీ వాసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సీ కాలనీలోని డప్పు రమేష్ ఇంటిని ఆనుకొని.. గ్రామానికి తాగునీటి సరఫరా చేసే బోర్‌కు సంబంధించిన మీటర్, స్టార్టర్ ప్యానల్ బోర్డు గ్రామపంచాయతీ సిబ్బంది ఏర్పాటు చేసింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఉదయం మీటర్ స్టార్టర్ బోర్డులో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో ఎస్సీ కాలనీ వాసులు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు విద్యుత్ శాఖ లైన్‌మెన్‌కు ఫోన్ చేసి చెప్పగా,సరఫరా నిలిపివేశారు.

ఉర్దూ మీడియం సమస్యలపై ఫిర్యాదు


మంత్రికి సమస్యలు వివరిస్తున్న అక్తర్ అహ్మద్

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఉర్దూ మీడియానికి సంబంధించిన సమస్యలపై మంత్రి హరీశ్‌రావుకు ఫిర్యాదు చేసి వినతిపత్రం అందజేశామని ఎంఐఎం నియోజకవర్గం అధ్యక్షుడు అక్తర్ అహ్మద్ చెప్పారు. జిల్లా ఇన్‌చార్జి, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియొద్దీన్ ఆధ్వర్యంలో శుక్రవారం మంత్రిని హైదరాబాద్‌లో కలిశామన్నారు. ఉర్దూ మీడియం పాఠశాలలో టీచర్లు, జూనియర్, డిగ్రీ కళాశాలలో లెక్చరర్లను నియమించాలని కోరామన్నారు. జహీరాబాద్‌కు ఉర్దూ మీడియం డీఎడ్ కళాశాల, శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని విన్నవించినట్లు చెప్పారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

జహీరాబాద్: పట్టణ శివారులోని ఓ వెంచర్ మధ్యలో ఉన్న వరదవాగుపై అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది జేసీబీతో కల్వర్టు, గోడలను తొలగించారు. వర్షం నీరు సవ్యంగా ముందుకు వెళ్లకపోవడంతో అధికారులు వెంచర్ మధ్యలో ఉన్న వాగుకు అడ్డంగా నిర్మించిన నిర్మాణాలు పూర్తిగా తొలగించారు.

గూడు చెదిరే..

ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు సామాన్యుడి గూడు చెదిరింది. రెక్కలు ముక్కలు చేసుకొని నిర్మించుకున్న పూరిళ్లు, పెంకుటిళ్లు వాన దెబ్బకు నేలకొరిగాయి. కళ్ల ముందే తమ ఇళ్లు కూలిపోతుండటం చూసి కన్నీటి పర్యంతమవుతున్నారు. తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక లోలోన మదనపడుతున్నారు. కాగా, ముసురు ఎంతో ముప్పు తెచ్చిపెట్టిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


నర్సాపూర్ రంగంపేటలో కూలిన ఇల్లు

సాక్షి, న్యూస్ నెట్‌వర్క్ : ఉమ్మడి జిల్లాలో కురుస్తున్న వర్షాల ధాటికి సిద్దిపేట కొమురవెల్లిలో మండలంలోని గురువన్నపేట, అయినాపూర్‌ల్లో 4 ఇళ్లు కూలిపోయాయి. మద్దూరు లద్నూర్‌లో భోగి సబితకు చెందిన ఇల్లు పాక్షికంగా కూలిపోయింది. దౌల్తాబాద్, రాయపోలు మండలాల్లో మహ్మద్ షాపూర్‌లో గోడలు తడిసి సంగనిస్వామి అనే వ్యక్తి పెంకుటిళ్లు కూలింది. వడ్డేపల్లిలో అయ్యగళ్ల లక్ష్మీ నర్సయ్యకు చెందిన గుడిసె, బేగంపేటకు చెందిన తిప్పని ఐలమ్మకు చెందిన పూరిల్లు ధ్వంసమైంది. వర్గల్‌లో తౌటి స్వరూప వెంకటేశం దంపతుల ఇల్లు అర్ధరాత్రి తర్వాత కుప్పకూలింది. మరో 5 ఇళ్లకు పాక్షికంగా దెబ్బతిన్నాయి. వర్గల్‌లోనే మరొకటి, శేరిపల్లిలో ఒకటి, శాకారంలో 2, జబ్బాపూర్‌లో ఇల్లు పాక్షిక నష్టం వాటిల్లింది. గిర్మాపూర్‌లో జనావాస ప్రాంతంలో చెట్లు విరిగి పడ్డాయి. కాగా శివ్వంపేటలో 4, దొంతిలో 7, కొత్తపేటలో 2, లింగోజిగూడలో 2, సికింద్లాపూర్‌లో 2, తిమ్మాపూర్‌లో ఇల్లు పాక్షికంగా కూలింది. నవాబుపేట సాంబయ్య చెరువు నిండి అలుగు పారుతోంది. గురురాత్రి పిడుగుపాటుకు బాసంపల్లి నర్సింలు రైతుకు చెందిన లేగదూడ మృత్యువాత పడింది. పటాన్‌చెరు బొల్లారం మున్సిపల్ పరిధిలోని పలు పురాతన ఇళ్లు కూలాయి. జిన్నారంలోని పలు పెంకుటిళ్లు కుప్పకూలాయి.

అందోల్ మునిపల్లిలో మేళసంగ్యంలో 1, మునిపల్లిలో 3 ఇళ్లు కూలిపోయాయి. సంగారెడ్డి సదాశివపేటలో పట్టణంలోని 25వ వార్డులో డప్పూరి చంద్రశేఖర్ ఇల్లు కూలింది. రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ కుమారుడు చింతా సాయినాథ్ బాధితుడి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కొడిపల్లిలో 23 పూరిళ్లు పాక్షికంగా కూలినట్లు డిప్యూటీ తహసీల్దార్ తారాబాయ్, ఆర్ శ్రీహరి శుక్రవారం తెలిపారు. మనోహరాబాద్‌లోని పలు గ్రామాల్లో 9 పాక్షికంగా కూలాయి. కోనాయపల్లి(పీటీ)లో చిర్మని మహేశ్‌కు చెందిన ఇల్లు, చెట్లగౌరారంలో 2, జీడిపల్లి 3, పర్కిబండ 2, పోతారం ఒక ఇల్లు పాక్షికంగా ధ్వంసమైంది. సదాశివపేట రూరల్లో మండల పరిధిలోని ముబారక్ పూర్(ఏ)కు చెందిన షరీఫొద్దీన్ ఇల్లు కూలింది. కొండపాకలో 5 ఇళ్లు కూలిపోయాయి. మర్పడ్గ, దుద్దెడ, జప్తినాచారం, మంగోల్‌ల్లోని చెరువులు అలుగు పారుతున్నాయి. కొల్చారం రంగంపేటలో కూలిన ఇల్లు కూలింది. చిన్నశంకరంపేటలోని ఖాజాపూర్‌లో 6 , మరిన్ని గ్రామాల్లో మరో 11 ఇళ్లు కూలాయి.


రాయపోలు: మహ్మద్‌షాపూర్‌లో..


వర్గల్‌లో ..


కొమురవెల్లి: అయినాపూర్‌లో..


జిన్నారంలో కూలిన పైకప్పు


కొండపాకలో


శివ్వంపేట మండలం సికింద్లాపూర్‌లో ..


లక్ష్మీప్రసన్నసాగర్ ప్రధాన రోడ్డుపై ఉబికి వస్తున్న మురుగు

నిబంధనలకు నీళ్లు

ఇళ్లల్లోని వర్షపు నీటి ప్రవాహం పారడానికి యూజీడీ కనెక్షన్ ఇవ్వకూడదు. కొన్ని ప్రాంతాల్లో అధికారులిచ్చారు. దీంతో మురుగునీరు ఉప్పొంగి, రహదారులపైకి చేరి దుర్వాసన వెదజల్లుతోంది. మరో వైపు భారీ వర్షాలకే యూజీడీ చాంబర్లు ఉప్పొంగడం కూడా లోపభూయిష్ట పనులకు తార్కాణంగా నిలుస్తోంది.

- యూజీడీ పనులు లోపభూయిష్టం
- వర్షమొస్తే చాంబర్ల నుంచి ఉబికొస్తున్న డ్రైనం
- రోడ్లపైకి చేరుతోన్న మురుగు
- గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో.. ఇదీ దుస్థితి

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో యూజీడీ (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) పనులు లోపభూయిష్టంగా సాగడంతో లోపాలు బయటపడుతున్నాయి. తాజా భారీ వర్షాల నేపథ్యంలో యూజీడీ చాంబర్‌ల నుంచి మురుగు ఉబికి రోడ్లపైకి వస్తూ దుర్వాసన వెదజల్లుతోంది. పట్టణంలోని లక్ష్మీప్రసన్ననగర్, సిరిఎన్‌క్లేవ్ తదితర కాలనీల్లో మురుగు ఉబికి బయటకొస్తుండడం, రహదారులపై దుర్గంధం వెదలజల్లుతుండడం అందుకు నిలువుటద్దం. సాధారణంగా యూజీడీ కనెక్షన్ వంటగదుల, టాయ్‌లెట్లు, స్నానపు గదుల మురుగు పారుదలకు మాత్రమే ఇవ్వాల్సి ఉంది. కానీ నిబంధనలకు పాతరేసి పలుచోట్ల ఇళ్లల్లో వర్షపు నీటికి ఇవ్వడంతో ఈ దుస్థితి నెలకొంది. మురుగు నివారణకు చేపట్టిన నిర్మాణం తిరిగి దానిని రోడ్లపై వదులుతున్నారు. దీంతో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. అంచనాలను ఇటీవల రూ.99 కోట్ల నుంచి 155 కోట్లకు ఆమాంతంగా పెంచారు. లోపాలు సరి చేసి, పనులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీనిపై కథనం.

నిధులిలా వచ్చాయి..

సీఎం కేసీఆర్ తన ఇలాకాలో.. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి ఎస్‌డీఎఫ్(స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) కింద రూ.99 కోట్ల నిధులు మంజూరు చేశారు. దీంతో గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌ల్లో 2020 జూన్‌లో 138 కిలోమీటర్ల మేర భూగర్భ మురుగు పైప్‌లైన్ వ్యవస్థతోపాటు 4 చోట్ల ఎస్‌టీపీ(సేవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్)ల నిర్మాణం పనులు ప్రారంభించారు. అందులో పైప్‌లైన్ల పనులు సాగుతుండగా, 4 ఎస్‌టీపీలు పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నారు. ఇక ఇళ్ల కనెక్షన్ల పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం 8,600 ఇళ్ల కు కనెక్షన్లు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటివరకు 7 వేల పైగా ఇచ్చినట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

అంచనా వ్యయం పెంపు

యూజీడీకి విడుదలైన రూ.99కోట్ల పనులతో పూర్తిగాక అధికారులు అంచనా పెంచారు. నిజానికి ముందున్న ప్రతిపాదనల్లో 138 కిలోమీటర్ల పైప్‌లైన్ విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంటే ప్రస్తుతం కేవలం 99 కిలోమీటర్ల వరకే పనులు పూర్తిచేశారు. కానీ పట్టణంలో ఇంకా పనుల్లో పైపులైన్లు నిర్మించాల్సిన కాలనీలున్నాయి. వీటి కోసం అదనపు నిధులు కోరామని అధికారులు చెబుతున్నారు. అదనంగా వచ్చిన రూ.56 కోట్లతో సుమారుగా 99 కిలోమీటర్ల నుంచి 130 కి.మీపైగా పైప్‌లైన్ పనులు పూర్తి చేశామని చెబుతున్నారు. పట్టణ అవసరాలను ముందుగానే అంచనా వేయడంలో అధికారులు విఫలం కావడంతో రెండోసారి అంచనాలు పెంచారని తెలుస్తోంది. పనులు సుమారుగా పూర్తి చేశామని అధికారులు చెబుతున్నా కోటమైసమ్మ రోడ్డు వైపు, పలు కాలనీల్లో ఇంకా పనులు కొనసాగుతున్నాయి.

లోపాలు సరిచేయిస్తాం

గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని యూజీడీ పనుల్లో లోపాలు బయట పడుతున్న మాట వాస్తవమే. చాంబర్ల నుంచి మురుగు ఉబికి రావడానికి ఇళ్లల్లో వర్షపు నీటి కనెక్షన్లు ఇవ్వడమే కారణం. వీటిని పరిశీలించి తొలగిస్తాం. మురుగు ఇక నుంచి బయటకు రాకుండా చూస్తాం. ఇతర చిన్న, చిన్న లోపాలు సరిచేసి త్వరలోనే వంద శాతం పనులు పూర్తి చేస్తాం.

–వీర ప్రతాప్, ప్రజారోగ్యశాఖ ఈఈ

స్నేహితుడిని కలిసేందుకు వెళ్తూ..

- బైక్, లారీ ఢీకొని ఇద్దరి మృతి
- చేగుంట 44వ నంబర్ జాతీయ రహదారిపై ఘటన


బాలాజీసింగ్


రవితేజ

చేగుంట(తూప్రాన్): బైక్, లారీ ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ సంఘటన చేగుంట శివారులోని మక్కరాజీపేట బైపాస్ బ్రిడ్జి సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రామయంపేట మండలం జాన్సిలింగాపూర్‌కు చెందిన టాకూర్ బాలాజీసింగ్(32), కోళ్ల రవితేజ(20) బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తున్నారు. చిన్నశివునూర్ శివారు నుంచి వస్తున్న కంటైనర్, బైక్ మక్కరాజీపేట బైపాస్‌బ్రిడ్జి సమీపంలో 44వ నంబర్ రహదారిపై ఎదురెదురు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బాలాజీసింగ్, రవితేజలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాలాజీసింగ్ కూలీ పనులు చేసుకునేవాడు కాగా, రవితేజ ఉపాధి హామీ పనులతోపాటు ఇతరేతర పనులు చేసుకునేవాడు. వీరిద్దరూ హైదరాబాద్‌లో ఉన్న స్నేహితుడిని కలిసేందుకు వెళుతుండగా రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందారు. వీరి మృతితో గ్రామంలో విషాధచాయలు అలముకున్నాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐదుగురు అదృశ్యం

వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగురు అదృశ్యమయ్యారు. నంగునూరులో ఇంటి నుంచి వెళ్లి ఒకరు, పటాన్‌చెరు పీఎస్‌పరిధిలో డ్యూటీకి వెళ్తున్నానని మరొకరు, ఝరాసంగం మండలంలో ఇద్దరు కూతుళ్లతో సహా తల్లి అదృశ్యమయ్యారు. పోలీసులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం..

పటాన్‌చెరు టౌన్ : డ్యూటీకి వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పీఎస్ పరిధిలో ఆలస్యంగా బుధవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని గౌతమ్‌నగర్ కాలనీకి చెందిన అబ్రహం కూతురు(21) మదీనగూడలోని జీఎస్ఎం మాల్లో పనిచేసుకునేది. ఈనెల 17న డ్యూటీకి వెళుతున్నానని ఇంటి నుంచి వెళ్లి ఎంతకీరాలేదు. ఆమె కుటుంబ సభ్యులు పనిచేసే చోటుకు వెళ్లి విచారించగా డ్యూటీకి రాలేదని తెలిపారు. దీంతో కుటుంబీకులు.. తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆచూకీ లభించలేదు. కూతురి అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లలతో సహా తల్లి ..

ఝరాసంగం(జహీరాబాద్): పిల్లలతో సహా తల్లి అదృశ్యమైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలపరిధిలోని జీర్లపల్లికి చెందిన మీనాక్షి తన కూతుర్లు నందిని, జహన్విలను తీసుకొని ఈనెల 20న మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. తెలిసిన వారిని, బంధువులను విచారించినా వారి ఆచూకీ తెలియరాలేదు. వెంటనే భర్త భర్త శివకుమార్ పోలీసులకు ఆశ్రయించారు. ఎస్సై రాజేందర్ రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.


అదృశ్యమైన తల్లీకూతుళ్లు

నంగునూరు(సిద్దిపేట): ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన నంగునూరులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాజుగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన దేవులపల్లి చంద్రయ్య (55) వారం రోజుల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లి ఎంతకీ రాలేదు. బంధువులు, తెలిసిన వారిని విచారించినా ఆచూకీ తెలియరాలేదు. చంద్రయ్య భార్య దేవులపల్లి కనకవ్వ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


చంద్రయ్య

ఉపాధ్యాయులు, ఉద్యోగులకు అన్యాయం

- ఐక్య ఉపాధ్యాయ పోరాట కమిటీ నాయకులు



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నూతన పెన్షన్ విధానంతో ఉపాధ్యాయ, ఉద్యోగుల కుటుంబాలకు అన్యాయం జరుగుతోందని ఐక్య ఉపాధ్యాయ పోరాట కమిటీ నాయకులు న్నారు. జాయింట్ ఫోరమ్ ఫర్ రిస్టోరేషన్ ఆఫ్ ఓల్డ్ పెన్షన్ స్కీం (జేఎఫ్ఆర్‌టీపీఎస్) ఆధ్వర్యంలో ఈ నెల 23న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పాత పెన్షన్ సాధన సదస్సును విజయవంతం చేయాలని అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐక్య ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో పాత పెన్షన్ సాధన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూఎస్పీసీ రాష్ట్ర నాయకులు తిరుపతిరెడ్డి, తప్పెట్ల యాదగిరి, సీఎచ్. విజేందర్ రెడ్డి, టీ.రాజిరెడ్డి మాట్లాడుతూ 2004 నుంచి దేశవ్యాప్తంగా ఈ నూతన పెన్షన్ విధానం అమలవుతోందని, దీని ఫలితంగా ఉపాధ్యాయులు, ఉద్యోగుల్లో తీవ్రమైన అసంతృప్తి ఉందన్నారు. అందుకే దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థల్లోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఈ నూతన పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు దేవరాజ్, ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ జిల్లా నాయకులు సమ్మయ్య, కృష్ణ, నరసింహారెడ్డి, మల్లయ్య, కనకరాజు, ఎం.పద్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : వర్షపు నీరు పోయే కాలువలో పడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన కొల్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తెల్లాపూర్‌లో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... తెల్లాపూర్ మున్సిపాల్టీ పరిధిలోని మై హోమ్ సయుక్ సమీపాన గల కాలువలో ఓ వ్యక్తి మృతదేహాన్ని కూలీలు గుర్తించారు. వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు కాలువలో పడి ఉన్న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని బయటకు తీశారు. అతడి వయస్సు 40 ఏళ్ల ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు వారు కేసు దర్యాప్తు చేసున్నారు.

అందోల్–జోగిపేట మున్సిపాలిటీకి రూ.25కోట్లు

వట్‌పల్లి(అందోల్): అందోల్–జోగిపేట మున్సిపాలిటీ అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసినట్లు అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ తెలిపారు. అందోల్–మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. టీయూఎఫ్ఐడీసీ నిధుల కింద అందోల్–జోగిపేట అభివృద్ధికి ప్రత్యేకంగా రూ.25 కోట్లు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. గతంలో సీఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని అన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు మంజూరు చేయడంపై సీఎం కేసీఆర్‌కు, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

దత్తగిరి పీఠాధిపతులకు ఘనస్వాగతం


పూర్ణాహుతి నిర్వహిస్తున్న పీఠాధిపతులు

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలో ఆధ్యాత్మిక క్షేత్రమైన బర్దీపూర్ దత్తగిరి మహరాజ్ ఆశ్రమ పీఠాధిపతులకు ఘనస్వాగతం పలికారు. అనసూయ మాత ఆధ్వర్యంలో చార్ధామ్ యాత్ర ముగించుకొని ఆశ్రమానికి వచ్చిన పీఠాధిపతులు 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహరాజ్‌కు, డాక్టర్ సిద్దేశ్వర స్వామికి స్వాగతం పలికారు. ఆశ్రమంలో యజ్ఞంతోపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. లోక కల్యాణార్థం దత్త హోమం దత్త యజ్ఞం, పూర్ణాహుతి, మహామంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. అదేవిధంగా జ్యోతిర్లింగాల వద్ద అభిషేకం మహామంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో అర్చకుడు శివ శంకర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.